Namasthe Telangana    Q- 25/02/14

# రైలుతోపాటు బస్సు

రైలు ప్రయాణమే కాదు రోడ్డు రవాణాకు కూడా ఏర్పాట్లు చేస్తోంది హైదరాబాద్ మెట్రో రైలు(హెచ్ఎంఆర్). ప్రయాణికుల అవసరాలను గుర్తెరిగి ఒక్క రైల్వే ప్రాజెక్ట్‌తోనే సరిపెట్టుకోకుండా బస్సులను కూడా నడపడానికి కసరత్తు చేస్తోంది. స్టేషన్ల నుంచి కాలనీలకు, కాలనీల నుంచి స్టేషన్లకు సొంత బస్సులను నడిపించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది.

-టీ మీడియా, సిటీబ్యూరో



ఢిల్లీలో నడుస్తున్న మెట్రో బస్సు (ఫైల్)

మెట్రో రైలు ప్రాజెక్ట్ గురించి భారీ అంచనాలే ఉన్నా... అసలు రైలు దిగి ఇంటికెలా వెళ్లడమనే ప్రశ్నలు గ్రేటర్‌వాసుల మెదళ్లను తొలుస్తున్నాయి. సౌకర్యవంతమైన ప్రయాణమంటున్నారు... రైలు ఎక్కడం... దిగడం... సౌకర్యవంతమే అయినా రోడ్డెక్కితే సంగతేమిటనే ప్రశ్నలు ఉన్నాయి.. రైలు దిగిన వెంటనే నేరుగా ఇంటికెళ్లడానికి బస్సు దొరికితే ఎంత బాగుంటుంది చెప్పండి. రైలు దిగడం ఒక వంతైతే స్టేషన్ నుంచి ఇంటికి చేరుకోవడం ఒక ప్రహసనం. అసలే మన ఆర్టీసీ బస్సులు ఎంత రద్దీగా ఉంటాయో మనందరికీ తెలిసిందే. ఈ ఇబ్బందులు గ్రహించిన హెచ్ఎంఆర్ బస్సులు నడపడానికి సన్నాహాలు చేస్తోంది.

మెట్రో స్టేషన్ల నుంచి అన్ని ప్రాంతాలకు సొంత బస్సులను నడపడానికి హెచ్ఎంఆర్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై ప్రణాళిక రూపొందించిన సాధ్యాసాధ్యాలపై అంచనాలు రూపొందిస్తున్నారు. ప్రాజెక్ట్‌లో భాగంగా మూడు కారిడార్లలో మొత్తం 66 మెట్రో స్టేషన్లు నిర్మిస్తుండగా, 3 ఇంటర్‌చేంజ్ స్టేషన్లు మినహా 63 స్టేషన్ల నుంచి ఈ బస్సులను నడపాలని అధికారికంగా నిర్ణయించారు. ఇంటర్‌చేంజ్ స్టేషన్లుగా కారిడార్-1లో ఉన్న అమీర్‌పేట, కారిడార్-2 లో ఎంజీబీఎస్ స్టేషన్, కారిడార్-3 లో పరేడ్‌గ్రౌండ్స్ మినహాయించి మిగతా స్టేషన్లంటి నుంచి బస్సులను నడపాలని యోచిస్తున్నారు. ఎన్ని బస్సులను నడపాలి..? ఏయే రూట్లలో నడిపించాలి, చార్జీలు, బస్సుపాస్‌లు, స్మార్ట్‌కార్డు తదితర విషయాలపై పూర్తి స్థాయి స్పష్టత కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్టేషన్లో రైలు దిగిన తర్వాత స్కైవాక్, ఎస్కలేటర్, లిఫ్టుల ద్వారా నేరుగా బస్సులు నిలిపే ఫ్లాట్‌ఫాం మీదికి చేరుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఢిల్లీలో ఇలా..**

- ఢిల్లీ మెట్రో రైల్ లిమిటెడ్ నుంచి 72 రూట్లలో 18-20 మంది ప్రయాణించడానికి వీలున్న 300 మినీ బస్సులను నడుపుతున్నారు.ప్రతి 10 నిమిషాలకో చొప్పున బస్సులను నడిపిస్తున్నారు. ఇదే తరహా ఇక్కడ కూడా నడిపించడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.



**నేరుగా కాలనీలకే...**

మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా కాలనీలు, బస్తీలకు ఈ బస్సులు నడిపిస్తారు. ఆర్టీసీ కేవలం ప్రధాన రూట్లకే పరిమితం అవుతుండటంతో అధికారులు ఈ నిర్ణయానికి వచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో 1600 వరకు కాలనీలు, బస్తీలు ఉన్నాయి.

**బస్సులు నడిపే స్టేషన్లివే..**

**కారిడార్ -1లో...**

మియాపూర్, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీకాలనీ, కూకట్‌పల్లి, బాలానగర్, మూసాపేట, భరత్‌నగర్, ఎర్రగడ్డ, ఈఎస్ఐ హాస్పిటల్, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎర్రమంజిల్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, గాంధీభవన్, ఉస్మానియా మెడికల్ కళాశాల, మలక్‌పేట, న్యూమలక్‌పేట, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, వివేకానంద మెమోరియల్, ఎల్బీనగర్.

**కారిడార్ -2లో..**

జేబీఎస్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, గాంధీ హాస్పిటల్, ముషీరాబాద్, ఆర్‌టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, నారాయణగూడ, సుల్తాన్‌బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, శంషేర్‌జంగ్, జంగమ్మెట్, ఫలక్‌నుమా.

- మెట్రో స్టేషన్ల నుంచి సొంత బస్సులు నడపడానికి హెచ్ఎంఆర్ సన్నాహాలు
- కాలనీలు, బస్తీల వరకు..
- 63 స్టేషన్ల నుంచి ఏర్పాటుకు కసరత్తు
- ప్రయాణికుల సౌకర్యం కోసమేనంటున్న అధికారులు

**కారిడార్ 3లో..**

శిల్పారామం, హైటెక్‌సిటీ, మాదాపూర్, పెద్దమ్మగుడి, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, రోడ్ నెం.5, ఎల్లారెడ్డిగూడ, మధురానగర్, బేగంపేట, ప్రకాశ్‌నగర్, రసూల్‌పుర, ప్యారడైజ్, సికింద్రాబాద్, మెట్టుగూడ, తార్నాక, హబ్సిగూడ, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, ఉప్పల్, నాగోలు.

## మల్టీ మోడల్ ట్రాన్సిట్ సిస్టమ్‌గా మెట్రో

మెట్రో ఒక్క రైల్ ప్రయాణానికి మాత్రమే కాదు. దీనిని బహుళ ప్రయోజనాలు సమకూర్చే ప్రాజెక్ట్‌గా చూడాలి. రైళ్లతో పాటు బస్సులను, స్కైవాక్‌లను, రైతుబజార్లను, షాపింగ్‌మాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ప్రయాణికులు, వినియోగదారులను సంతృప్తి పరచడానికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నాం. అన్నీ కాలనీలు బస్తీల్లో వీటిని నడుపుతాం. దీని కోసం కసరత్తు చేస్తున్నాం.

-ఎన్వీఎస్‌రెడ్డి హెచ్ఎంఆర్ ఎండీ

